వాయిస్ టుడే

హైదరాబాద్
మంగళవారం, 31 డిసెంబరు 2024

# ఉచిత వృత్తి శిక్షణ తరగతులను ప్రారంభించిన ఏరియా సింగరేణి సేవ సమితి అధ్యక్షురాలు జి. మధుర వాణి షాలెం రాజు

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే డిసెంబర్ 30: సోమవారంన సత్తుపల్లి ఏరియాలోని జలగం నగర్ కాలనీ పీవీ నరసింహారావు కాలనీ నందు నిరుద్యోగ మహిళలు గృహిణులు కొత్తగూడెం ఏరియా సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వృత్తి శిక్షణ తరగతులను జలగం నగర్ లో కంప్యూటర్ కోర్స్ & టైలరింగ్ కోర్స్ పీవీ నరసింహారావు కాలనీ నందు టైలరింగ్, మగ్గం ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులు కొత్తగూడెం ఏరియా సింగరేణి సేవ సమితి అధ్యక్షురాలు జి. మధుర వాణి షాలెం రాజు ప్రారంభించడం జరిగింది.



ఈ సందర్భంగా సింగరేణి సేవ సమితి అధ్యక్షురాలు మాట్లాడుతూ సింగరేణి సంస్థ అందిస్తున్న సేవలను కొనియాడారు సింగరేణి సేవా సమితి ద్వారా ఈ ఉచిత వృత్తి శిక్షణ తరగతులకు హాజరై నిరుద్యోగ మహిళలు గృహిణులు వారి కుటుంబాలకు ఆర్థిక లబ్ధిని చేకూర్చుకోవాలన్నారు వారు ఈ శిక్షణ తరగతులకు శ్రద్ధగా క్రమశిక్షణతో ఆసక్తితో హాజరై నేర్చుకోవాలని నేర్చుకోవడమే కాకుండా ఇతరులకు కూడా నేర్పించి స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించాలని ఈ సందర్భంగా తెలియజేశారు సింగరేణి సంస్థ మీకు అందిస్తున్న ఈ ఉచిత వృత్తి శిక్షణ సేవలను సద్వినియోగం చేసుకొని స్వయంకృత ఉపాధిని పొంది ఆర్థిక లబ్ధిని పొందవలసిందిగా సేవా సభ్యులకు తెలియజేయడం జరిగింది. అలాగే గత ఆర్థిక సంవత్సరంలో కోర్సులు కంప్లీట్ చేసిన అభ్యర్థులకు ఎగ్జామ్ నిర్వహించారు అందులో ఉత్తీర్ణత పొందిన వారికి సర్టిఫికెట్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమములో కొత్తగూడెం ఏరియా సింగరేణి సేవా అధ్యక్షురాలు జి. మధుర వాణి షాలెం రాజు తో పాటు భవాని రవీందర్, జే.వి.ఆర్ ఓ.సి సీనియర్ పిఓ కె. దేవదాస్, నాగలక్ష్మి జలగం నగర్ మున్సిపల్ కౌన్సిలర్, సింగరేణి సేవా సమితి కోఆర్డినేటర్ సిహెచ్ సాగర్ శిక్షణ తరగతులు ఇచ్చు ఫ్యాకల్టీ శిక్షణ తరగతులు నేర్చుకునే వారు ఇతర సభ్యులు పాల్గొన్నారు.



## నేడు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

### డ్రగ్స్, గంజాయి వినియోగించే వారిపై కఠిన చర్యలు : ఎస్పీ

మహబూబ్‌నగర్ నేరవిభాగం: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 31న రాత్రి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు బ్రీత్ అనలైజర్లతో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తామని ఎస్పీ డి.జానకి తెలిపారు. సోమవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. మద్యం దుకాణాలు నిర్ణీత సమయానికే మూసెయ్యాలని, మైనర్లకు మద్యం విక్రయించరాదని స్పష్టంచేశారు. బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ, ఖాళీ స్థలాల్లో మద్యం తాగడం నిషేధమన్నారు. గంజాయి, డ్రగ్స్, మద్యం తాగి వాహనాలు నడపటం, ర్యాష్ డ్రైవింగ్, ద్విచక్రవాహనంపై ముగ్గురి ప్రయాణం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం, సైలెన్సర్లను తీసేసి పెద్ద శబ్దాలు చేసుకుంటూ వెళ్లటం, డీజేలు పెట్టి అందరికీ అసౌకర్యం కలిగించటం వంటి చర్యలకు పాల్పడితే జైలుశిక్షలు పడేలా కేసులు నమోదు చేస్తామన్నారు. 31న రాత్రి ఎలాంటి వేడుకలు నిర్వహించాలన్నా ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ప్రజలు ఇబ్బందులకు గురైతే డయల్-100కు లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 87126 59360కు ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు. 2025లో జిల్లా ప్రజలందరికీ మంచి కలగాలని ఆశిస్తూ పోలీసు శాఖ తరపున నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఎస్పీ చెప్పారు.

## ఆదిశిలాక్షేత్రం భక్తజన సందోహం



మల్దకల్: మల్దకల్ ఆదిశిలాక్షేత్రం వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం అమావాస్య సందర్భంగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దర్శనానికి బారులుదీరారు. అమావాస్య సందర్భంగా స్వామివారికి దాసంగాలు పెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల గోవిందనామస్మరణతో ఆలయం మార్మోగింది. ఉదయం సుప్రభాత సేవలతో పూజలు ప్రారంభంకాగా సాయంత్రం పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి, శ్రీనివాసుడి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలతో వాల్మీకి పూజారులు దశమికట్ట వరకు ఊరేగించి ఆలయానికి చేర్చారు. ఈవో సత్యచంద్రారెడ్డి, ఛైర్మన్ ప్రహ్లాదరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంకులో చోరీకి యత్నం



అమరచింత: అమరచింతలోని యూనియన్ బ్యాంకులో చోరీకి యత్నం జరిగింది. ఈ సంఘటన సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు.. అమరచింత ఎస్సై బి.సురేశ్‌తో కలిసి చేసిన విచారణ వివరాలను ఆత్మకూరు సీఐ శివకుమార్ వెల్లడించారు. ఆ వివరాలు.. శుక్రవారం సాయంత్రం విధుల సమయం ముగిసిన అనంతరం తాళం వేసి బ్యాంకు మేనేజరు శివశంకర్‌తో పాటు, సిబ్బంది ఇళ్లకు వెళ్లిపోయారు. శని, ఆదివారం సెలవు కావడంతో సోమవారం ఉదయం 10 గంటలకు మేనేజరు వచ్చి తన ఛాంబర్‌లోకి వెళ్లారు. అక్కడ సీసీ కెమెరాల దృశ్యాలు ఎల్ఈడీ టీవీలో కనిపించకపోవడం, తీగలు తెగిపడి ఉండటాన్ని గమనించి పోలీసులకు, బ్యాంకు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. భవనం వెనుక ఉన్న ప్రహరీని దూకి దుండగులు బ్యాంకులోకి వచ్చారు. కిటికీ ఇనుప జాలి గ్రిల్‌ను తొలగించి లోపలికి ప్రవేశించారు. స్ట్రాంగ్ రూం తలుపులు పగులగొట్టేందుకు యత్నం చేసి విఫలమయ్యారు. బ్యాంకు లోపలకు వచ్చిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయని వారు వాటిని ధ్వంసం చేసి, తీగలు తొలగించారు. దృశ్యాలు నిక్షిప్తమైన చిప్ తీసుకుని, యథావిధిగా కిటికీ ఇనుప జాలి గ్రిల్ పెట్టి వెళ్లారు. క్లూస్ టీంతో వేలిముద్రలు సేకరించామని సీఐ తెలిపారు. డాగ్ స్క్వాడ్‌తో పరిసరాలను తనిఖీ చేయించామన్నారు. జీఎస్ నగర్ వరకు వెళ్లి వచ్చాయన్నారు. బ్యాంకులో ఎలాంటి నగదు, బంగారు చోరీ కాలేదని సీఐ వివరించారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకులో ఎలాంటి చోరీ జరగలేదని, ఖాతాదారులు ఆందోళన చెందవద్దని మేనేజర్ శివశంకర్ సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం


శ్రీనాథ్


భానుప్రకాష్

ఊర్కొండ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై వీరబాబు కథనం ప్రకారం.. కల్వకుర్తి పట్టణానికి చెందిన భానుప్రకాశ్ (21), శ్రీనాథ్ (20) ద్విచక్ర వాహనంపై ఊర్కొండ నుంచి కల్వకుర్తికి వెళ్తున్నారు. ఊర్కొండపేట గ్రామ శివారులోకి రాగానే పత్తి మిల్లు సమీపంలో 167 జాతీయ రహదారిపై అదుపు తప్పి బోల్తా పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. అతి వేగమే ప్రమాదానికి కారణమని ఎస్సై పేర్కొన్నారు.

# సీఎం కప్ కబడ్డీ పోటీల్లో రంగారెడ్డి జట్ల జయకేతనం

## రన్నర్స్‌గా నిలిచిన వనపర్తి, నల్గొండ



మహబూబ్‌నగర్ క్రీడలు : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ టోర్నీ సోమవారం ముగియగా మహిళా, పురుషుల విభాగాల్లో విజేతగా రంగారెడ్డి జట్లు నిలిచాయి. మహిళా విభాగంలో వనపర్తి, నల్గొండ జిల్లాల జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. పురుషుల విభాగంలో నల్గొండ, హైదరాబాద్ జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. మహిళల ఫైనల్స్‌లో రంగారెడ్డి జట్టు వనపర్తిపై 34-31 పాయింట్ల తేడాతో గెలుపొందింది. పురుషుల ఫైనల్ పోరులో రంగారెడ్డి జట్టు నల్గొండపై 57-39 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. విజేతగా నిలిచిన జట్లకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి పతకాలు, జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, పుర ఛైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, డీవైఎస్‌వో ఎస్.శ్రీనివాస్, ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్పీ వెంకటేశ్, కురుమూర్తి గౌడ్, ఒలింపిక్ సంఘం సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు జాకెర్, చెన్నవీరయ్య, వేణుగోపాల్, బాల్‌రాజ్, పాపారాయుడు పాల్గొన్నారు.

### నేటి నుంచి నెట్‌బాల్ రాష్ట్రస్థాయి టోర్నీ..

సీఎం కప్ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ టోర్నీ మంగళవారం నుంచి జనవరి 2వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లోని డీఎస్ఏ మైదానంలో నిర్వహిస్తారు. తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి 26 చొప్పున మహిళ, పురుషుల జట్ల నుంచి 630 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. మహిళలకు ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల, బీపీహెచ్ఎస్, మోడ్రన్ స్కూల్, బాలికల జూనియర్ కళాశాల, పురుషులకు ఎంవీఎస్ ఇండోర్ స్టేడియం, అంబేద్కర్ కళాభవన్, స్టేడియంలోని ఈతకొలను భవనంలో వసతి కల్పిస్తున్నారు. డీఎస్ఏ మైదానంలోని నాలుగు నెట్‌బాల్ కోర్టుల్లో మూడు రోజుల పాటు పోటీలు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో ఎస్.శ్రీనివాస్ తెలిపారు.



## ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుంది

### పైరవీలు లేకుండా నిరభ్యంతరంగా తనను సంప్రదించవచ్చు

### మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు

హనుమకొండ, వాయిస్ టుడే: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు తెలిపారు. సోమవారం హనుమకొండలోని రాంనగర్ లోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ప్రజల నుంచి వినతులను విజ్ఞప్తులను స్వీకరిస్తూ ప్రజల సమస్యలను సావధానంగా వింటూ అప్పటికప్పుడే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ఈ ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని కొండా వారికి భరోసా ఇచ్చారు. ఏ సమస్య ఉన్న ప్రజలు పైరవీలు చేయకుండా నిరభ్యంతరంగా తనను సంప్రదించవచ్చని, ఏలాంటి ఆపద సమయంలోనైనా కొండా దంపతులు ఎల్లవేళలా అండగా ఉంటారని కొండా మురళీధర్ రావు తెలియజేశారు.



## కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న స్రవంతిని పరామర్శించిన ఎమ్మెల్యే వినోద్

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి డిసెంబర్ 30 2024: (వాయిస్ టుడే) : సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బెల్లంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమరి సూరిబాబు రెండో అమ్మాయి హైదరాబాద్ కిమ్స్ హాస్పిటల్ లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారని తెలిసి హాస్పిటల్ కి వెళ్లి వారిని పరామర్శించిన బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి ప్రస్తుతానికి స్రవంతి ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్ని అడిగి తెలుసుకోవడం డాక్టర్ల సూచనలు సలహాలు పాటించాలని వారికి ధైర్యం చెబుతూ త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నానని తెలిపారు. వారితోపాటు టీ.పి.సి.సి ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరీ స్వామి తదితరులు పాల్గొన్నారు.






## జగిత్యాల న్యాయవాది మ్యాన మహేష్ కుమార్‌కి డాక్టరేట్

జగిత్యాల్ వాయిస్ టుడే ప్రతినిధి డిసెంబర్ 30: జగిత్యాల పట్టణానికి చెందిన న్యాయవాది,సామాజిక సేవకుడు మ్యాన మహేష్ కుమార్ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. సికింద్రాబాద్,లోని సిటీ కల్చరల్ ఆడిటోరియంలో స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో,స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్,ఏషియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ అకాడమీ,స్ఫూర్తి సకల కళా వేదిక ఆధ్వర్యంలో వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారికి ప్రముఖులచే డాక్టరేట్ ను ప్రధానం చేశారు. మ్యాన మహేష్ కుమార్ ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలను గుర్తించి డాక్టరేట్ ఇవ్వడం జరిగిందని నిర్వాహకుడు ఆకుల రమేష్ తెలిపారు.

హైకోర్టు న్యాయవాదిగా,రాష్ట్ర యువజన సంఘాల సమైక్య అధ్యక్షులుగా,జగిత్యాల జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్షులుగా ఏబీవీపీ,బీజేవైఎం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బీజేపీ నిర్మల్, మంచిర్యాల జిల్లాల ఇంచార్జి గా పనిచేసి సామాజిక సేవతో పాటు పలు సంఘాలకు బాధ్యులుగా వ్యవహరిస్తున్నందుకు గాను డాక్టరేట్ ను మ్యాన మహేష్ కుమార్ కు అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. డాక్టరేట్ అందుకున్న మ్యాన్ మహేష్ కుమార్ ను న్యాయవాదులు,పట్టణ ప్రముకులు,పలువురు మిత్రులు అభినందించారు.

## ప్రేమ వ్యవహారంతో యువతి యువకుడు మృతి





వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా డిసెంబర్ 30: జడ్చర్ల బీనవాబుపేట మండల పరిధిలోని కాకర్ల పహాడ్ గ్రామంలో యువతి, యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు . చాకలి అంకిత (18) అనే యువతి, అదే గ్రామానికి చెందిన రెడ్డిపల్లి చందు కుమార్ (20) అనే యువకుడు ఆదివారం ఒకే గ్రామంలో వేర్వేరు వేరు సమయాల్లో ఆత్మహత్యలు చేసుకున్నారు. అంకిత తన తల్లిదండ్రులు సుజాత,ఆంజనేయులు, తన సోదరుడు పని కోసం పర్వతాపూర్ మైసమ్మ దేవాలయం వద్దకు వెళ్లగా..మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మరియు చందు కుమార్ అదే రాత్రి ఊరు బయట చెట్టుకు కరెంట్ వైర్‌తో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అంకిత మహబూబ్ నగర్ ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుండగా..చందు కుమార్ మహబూబ్ నగర్ లోని వాసవి డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. యువతీ,యువకులు ఇద్దరు ఆత్మహత్యకు.వారి ప్రేమ వ్యవహారమే ఉండవచ్చుననే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. యువతి ఆత్మహత్య చేసుకోవడం వల్ల తనకు ఇబ్బందులు ఏర్పడ తాయనే ఉద్దేశంతో చందు కుమార్ ఆత్మహత్య చేసుకుని ఉంటాడని గ్రామస్తులు భావిస్తున్నారు. ఒకే రోజు గ్రామంలో ఇద్దరు యువతీ,యువకులు ఆత్మహత్యలకు పాల్పడడంతో..గ్రామంలో సంచలన మారింది. యువతి, యువకుల బంధువుల ఫిర్యాదుల మేరకు కేసులను నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై విక్రం తెలిపారు.